

19 వ వసంతంలోకి ...

# సూర్య

www.suryaa.com

సోమవారం,3 నవంబర్ 2025

కాకినాడ జిల్లా
కోనసీమ జిల్లా
తూర్పు గోదావరి జిల్లా
అల్లూరి సీతారామరాజు జిల్లా

8 పేజీలు

# కార్మికుల సమస్యలు పరిష్కారానికి కృషి చేస్తా



- జీఎస్టీ తగ్గింపుతో భవన నిర్మాణ కార్మికులకు మేలు
- గత వైసిపి డూప్లికేషన్ పేరుతో పథకాలు నిలిపివేసింది
- భవన నిర్మాణ కార్మికులు మా కుటుంబ సభ్యులు
- రాష్ట్ర కార్మికశాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్
- మంత్రి సుభాష్‌ను ఘనంగా సన్మానించిన కార్మిక సంఘాలు

**రామచంద్రపురం,మేజర్‌న్యూస్ :** అన్ని రంగాల్లో పనిచేస్తున్న కార్మికులను నాకుటుంబ సభ్యులుగా భావించి వారి సమస్యలు పరిష్కరించేందుకు కృషి చేస్తానని రాష్ట్ర కార్మికశాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ పేర్కొన్నారు. రామచంద్రపురంలోని ఎన్‌విఆర్ ఫంక్షన్ హాల్లో జరిగిన ఏపీ భవన నిర్మాణ కార్మికుల ఆత్మగౌరవ సభలో మంత్రి సుభాష్ ముఖ్య అతిధిగా పాల్గొని మాట్లాడారు. జీఎస్టీ తగ్గింపుతో కూటమి ప్రభుత్వం నిర్మాణ రంగానికి,భవన నిర్మాణ కార్మికులకు మేలు చేసిందనిఅన్నారు.కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు జిఎస్టి తగ్గించి భవననిర్మాణ వ్యయం తగ్గించాయన్నారు. సిమెంటుపై పది శాతం, ఫ్లోరింగుపై ఏడు శాతం, మార్బుల్స్, గ్రానైట్, ఇసుక, ఇటుకలపై ఏడు శాతం జీఎస్టీ తగ్గించిందని వివరించారు.తద్వారా ద్వితీయ శ్రేణి నగరాల్లో 1000చదరపు అడుగుల ప్లాటునిర్మాణం వ్యయం రూ.30 లక్షలు అయితే, జిఎస్టి తగ్గింపు కారణంగా నిర్మాణదారుకు రూ.1.5 లక్షలు వరకూ ఖర్చు తగ్గుతుందన్నారు. నిర్మాణ రంగ ఖర్చులు తగ్గించి నూతన నిర్మాణాలకు ప్రోత్సాహం కల్పించిన కూటమి ప్రభుత్వ నిర్ణయంతో వినియోగ దారులకు తక్కువ ఖర్చుతో లాభం, భవిష్యత్తుకు మేలైన పెట్టుబడి పెట్టుకునే అవకాశం లభిస్తుందన్నారు. గత వైసీపీ ప్రభుత్వంలో ఇసుక బంగారమై, కార్మికులకు వంద రోజులు కూడా పని దొరకలేదన్నారు. గత వైసీపీ డూప్లికేషన్ పేరుతో పథకాలు నిలిపి వేసిందని విమర్శించారు. కార్మికుల పని దినాలు పెంచేందుకు పైలట్ ప్రాజెక్టుగా లేబర్ అటాచ్ ను ప్రవేశపెట్టనున్నట్లు తెలిపారు. 1214 జీవోతో నిలిచిపోయిన రిజిస్ట్రేషన్‌లను భవననిర్మాణకార్మికులు తిరిగి రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని మంత్రి సూచించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే భవన నిర్మాణ రంగాన్ని విశేషంగా ప్రోత్సహించేందుకు ఉచిత ఇసుక విధానం ప్రవేశపెట్టినట్టు తెలిపారు.తద్వారాకార్మికులకు విస్తృతంగా ఉపాధి అవకాశాలు పెరిగాయన్నారు.కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తగ్గించిన జిఎస్టి ద్వారా నిర్మాణ రంగానికి ఊతం లభించి, సామాన్య, మధ్యతరగతి వర్గాల ప్రజలకు మేలు కలుగుతుందని మంత్రి సుభాష్ తెలిపారు.భవన నిర్మాణ కార్మికుల నాయకులు అప్పారి శ్రీనివాస్, గానాల సత్యసాయి, రామోజీ శ్రీనివాస్, ధర్మాసనంరామకృష్ణ తదితరులు మాట్లాడుతూ కార్మికుల సంక్షేమ బోర్డు ద్వారా కలిగేప్రయోజనాలన్నీఅందేలా చూడాలని కోరారు. ముఖ్యంగా బిఓసి కార్డులు పంపిణీ, ప్రమాద రిలీఫ్ ఫండ్, కార్మికుని కుమార్తెలకు ప్రసూతి లబ్ధి, పనిముట్లు ఉచితంగా అందజేయడం, 50 సంవత్సరాలు దాటిన ప్రతి కార్మికులకు పెన్షన్ ఇచ్చే సదుపాయం అమలు చేసేలా చర్యలు తీసుకోవాలని కోరారు. కార్మికుల సమస్యలన్నీ పరిష్కరిస్తానని ఈ సందర్భంగా మంత్రి సుభాష్ హామీ ఇచ్చారు. అనంతరం కార్మిక సంఘాల ఆధ్వర్యంలో మంత్రి సుభాష్‌ను ఘనంగా సత్కరించారు. ఈకార్యక్రమంలో పలువురు సంఘ నాయకులు, అధిక సంఖ్యలో కార్మికులు పాల్గొన్నారు.

## కూటమి ప్రభుత్వంలోనే బీసీలకు రాజ్యాధికారం





- దొమ్మేటి వెంకటరెడ్డి ఆశయ సాధనకు కృషి
- ఈ నెల 16న అమలాపురంలో జరిగే వన సమారాధనకు తరలిరండి
- రాష్ట్ర కార్మికశాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్

**కాకినాడ,మేజర్‌న్యూస్ :** శెట్టిబలిజ జాతికోసం అహర్నిశలు పరితపించిన జాతిపిత దొమ్మేటి వెంకటరెడ్డి ఆశయాలసాధనకు పునరంకితం అవుదామని రాష్ట్ర కార్మికశాఖ మంత్రివాసంశెట్టిసుభాష్ పిలుపునిచ్చారు. శెట్టిబలిజ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఆదివారం కాకినాడ రూరల్ గైగోలుపాడులో జరిగిన కార్తీక వన సమారాధన ఆత్మీయ కలయిక కార్యక్రమంలో మంత్రిసుభాష్ పాల్గొన్నారు. తొలుత దొమ్మేటి వెంకటరెడ్డి విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. కార్యక్రమానికి హాజరైన సంఘీయులను ఆప్యాయంగా పలకరిస్తూ.. వారి యొక్క కష్టసుఖాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో మంత్రి సుభాష్ మాట్లాడుతూ జాతి సమైక్యత కోసం ప్రతి ఏటా వన సమారాధన నిర్వహించి జాతిఐక్యత,పటిష్టతకు కృషి చేయడం శుభ పరిణామం అన్నారు. ఇతర జాతులను గౌరవిస్తూనే.. శెట్టిబలిజల అభ్యున్నతి కోసం సంఘీయులంతా కృషి చేయాలని పిలుపునిచ్చారు. శెట్టిబలిజ జాతిపిత దొమ్మేటి వెంకటరెడ్డి ఆశయ సాధనకు ప్రతి ఒక్కరు కృషి చేద్దామని పేర్కొన్నారు.ఈనెల 16న

- తరువాయి 2లో..

## లండన్ పర్యటనకు బయలుదేరిన మంత్రి కందుల దుర్గేష్

- నవంబర్ 4 నుంచి 6 వరకు లండన్‌లో జరిగే "వరల్డ్ ట్రావెల్ మార్కెట్ - 2025"లో పాల్గొననున్నారు
- ఆంధ్రప్రదేశ్‌ను ప్రపంచ పర్యాటక గమ్యస్థానంగా తీర్చిదిద్దడమే లక్ష్యం -మంత్రి కందుల దుర్గేష్



**రాజమహేంద్రవరం,మేజర్‌న్యూస్ :** రాష్ట్ర పర్యాటక రంగ అభివృద్ధి, అంతర్జాతీయ స్థాయిలో ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేక గుర్తింపు తెచ్చే దిశగా పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్ లండన్ పర్యటనకు శనివారం రాత్రి బయలుదేరారు.రాజమహేంద్రవరం విమానాశ్రయం నుంచి ముంబయి చేరిన మంత్రిదుర్గేష్, ఆదివారం ఉదయం ముంబయి విమానాశ్రయం నుండినేరుగా

- తరువాయి 2లో..

# రామకృష్ణ మిషన్ ఉచిత వైద్య శిబిరం





**రంపచోడవరం, మేజర్ న్యూస్ :** రామకృష్ణ మిషన్ గిరిజన సంచార వైద్యశాల రాజమండ్రి వారి అధ్వర్యంలో స్థానిక, సిరిగిందలపాడు రామకృష్ణ మిషన్ ఆసుపత్రి వద్ద ఆదివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించినట్లు రామకృష్ణ మిషన్ కార్యదర్శి స్వామి పరిజ్ఞేయనందజీ మహరాజ్ తెలియచేసారు. ఈ వైద్య శిభిరంలో డాక్టర్ తలారి వెంకట సుబ్బారావు, డాక్టర్ రాయుడు శ్రీనివాస్, డాక్టర్ ఎస్.సంపత్ కుమార్, డాక్టర్ ఉమా మహేష్ సుమారు 160మందికి వైద్య సేవలు అందించినట్లు స్వామీజి తెలియజేసారు.అవసరమైన వారిలో 72 మందికి రక్తపరీక్షలు, 10 మందికి థైరాయిడ్ పరీక్షలు, 2 ఇ.సి.జి లు, 6మందికి ఎక్స్ రేలు, 15మందికి ఫిజియథెరపీ చేసినట్లు స్వామిజీ తెలియచేసారు.

ఏజెన్సీ గ్రామాల్లో రామకృష్ణ మిషన్ అందిస్తున్న వైద్య సేవలను సద్వినియోగం చేసుకోవాలని స్వామిజీ కోరారు. ఈ వైద్యశిబిరంలో రామకృష్ణ మిషన్ సిబ్బంది, రామకృష్ణ మిషన్ వైద్య సేవల సమన్వయకర్త కానుమోను శ్రీనివాస్, వాలంటీర్ దాసరి పెద్ద అప్పారావు పాల్గొన్నారు. రోగులకు, సహాయకులకు అన్నదానం

# నవంబర్ 3వ తేదీ సోమవారం యథాతథంగా పీజీఆర్ఎస్ కార్యక్రమం

**రాజమహేంద్రవరం, మేజర్ న్యూస్ :** ప్రజా సమస్యల పరిష్కారం కోసం రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన పీజీఆర్ఎస్ కార్యక్రమం నవంబర్ 3 వ తేదీ సోమవారం యథాతథంగా నిర్వహించబడుతుందని జిల్లా కలెక్టర్ కీర్తి చేకూరి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు.

ప్రజలు జిల్లా కేంద్రానికి రాకుండా తమ డివిజన్, మండల కేంద్రాలు, గ్రామ / వార్డు సచివాలయాల్లో అర్జీలు సమర్పించి సమస్యలకు పరిష్కారం పొందవొచ్చునని సూచించారు. అదే విధంగా ప్రజలు తమ ఫిర్యాదులను 1100 టోల్ ఫ్రీ నంబర్ లేదా meekosam.ap.gov.in ద్వారా సమర్పించవచ్చని, గత అర్జీల పరిష్కార స్థితి తెలుసుకోవడానికి 1100 కు కాల్ చేయవచ్చని తెలిపారు.

ప్రతి సోమవారం ఉ.10 గంటల నుంచి మ.1 గంట వరకు పీజీఆర్ఎస్ నిర్వహించబడుతుంది. ఇందులో జిల్లా, రెవెన్యూ, డివిజన్, మండల స్థాయి అధికారులు పాల్గొంటారు. ప్రజలు తమ స్థానిక కార్యాలయాల ద్వారానే అర్జీలు అందచేసి తగిన పరిష్కారం పొందాలని కలెక్టర్ కీర్తి చేకూరి విజ్ఞప్తి చేశారు.



ప్రజా ఫిర్యాదుల కోసం: 1100 (టోల్ ఫ్రీ)
WhatsApp గవర్నెన్స్: 9552300009
Website : meekosam.ap.gov.in
Email : collectoregodavari@gmail.com

## వామపక్ష నేతల మరణం పట్ల కరణం ఏడుకొండలు సంతాపం

**సామర్లకోట, మేజర్ న్యూస్:**"పోరాటమే నా ఊపిరి సమ సమాజ నిర్మాణమే నా పయనం, నా జీవితం" అని నమ్మి జీవించిన సీపీఎం పార్టీ ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కమిటీ మాజీ నాయకులు, తెలంగాణ రాష్ట్ర సీనియర్ నేత కామ్రేడ్ సామినేని రామారావు శుక్రవారం దారుణంగా హత్యకు గురైన విషయం తెలిసి మనసు చాలా బాధాకరంగా ఉందని వామపక్షవాది కరణం ఏడుకొండలు అన్నారు.శనివారం ఆయన ఒక ప్రకటనలో మాట్లాడుతూ ఈ నేరానికి పాల్పడిన హంతకులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. కామ్రేడ్ రామారావు మరణం తెలంగాణ ప్రజా ఉద్యమాలకు, సీపీఎం పార్టీకి తీవ్రమైన లోటు అని పేర్కొన్నారు. ప్రజా వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా పోరాడే హక్కు ప్రజలకుందని, అలాంటి పోరాటానికి ముందుండే శక్తి సీపీఎం పార్టీదేనని అన్నారు. పార్టీని అణచివేయాలనే కుట్రలు ఎంత పన్నినా, ఆ పార్టీ అభివృద్ధి దిశగా కొనసాగుతూనే ఉంటుందని తెలిపారు.ఇక ప్రజా సమస్యలపై నిరంతరం పోరాటం చేసిన, "పోరాటమే నా జీవితం" అనే తత్వంతో జీవించిన కామ్రేడ్ చింతకాయల బాబురావు అకాల మరణం చెందడం కూడా ప్రజా ఉద్యమాలకు తీవ్రమైన లోటుగా పేర్కొన్నారు. ఉమ్మడి రాష్ట్రంలో ఖమ్మంలో కామ్రేడ్ రామారావు, ఇక్కడ చింతకాయల బాబురావు గారుల మరణం ప్రజా ఉద్యమాలకు మరియు సీపీఎం పార్టీకి పెద్ద నష్టం అని ఆయన అభిప్రాయపడ్డారు.కామ్రేడ్ రామారావు, చింతకాయల బాబురావు ల మృతికి కరణం ఏడుకొండలు నివాళులర్పిస్తూ, వారి కుటుంబ సభ్యులకు సానుభూతి తెలిపారు.

# మొంథా తుఫాన్ బాధితులకు నగదు, నిత్యవసరాల పంపిణీ



**పెరవలి,మేజర్‌న్యూస్ :** తూర్పుగోదావరి జిల్లా నిడదవోలు నియోజకవర్గం పరిధిలో పెరవలి మండలం ఉసులుమర్రు గ్రామంలో నవంబర్ 2 వ తేదీ ఆదివారం రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక మరియు సినిమాటోగ్రఫీ మంత్రి కందుల దుర్గేష్ ఆదేశాల మేరకు గ్రామంలో మొంథా తుఫాన్ బాధితులకు 25 కిలోల బియ్యం, 1కిలో పంచదార, 1కిలో కందిపప్పు, 1 లీటర్ పామాయిల్, 1 కిలో ఉల్లిపాయలు, 1 కిలో బంగాళదుంపలు పంపిణీ చేయడం జరిగింది.ఈ సందర్భంగా ఆరు రకాల నిత్యావసర సరుకులు మరియు ప్రతి ఒక్కరికి 1000 చొప్పున ప్రతి కుటుంబానికి 3000 వరకు నగదు లబ్ధి దారుడికి ప్రతి ఒక్కరికి పంపిణీ చేయించేలా అధికారులను ఆదేశించి, ప్రజలకు ఆపన్నహస్తంగా నిలిచారు.ఈకార్యక్రమంలో జనసేనజిల్లా కార్యదర్శి తులా చినబాబు, గ్రామసర్పంచ వీరమల్ల నాగలక్ష్మి, జనసేన నాయకులు ముత్యాల దినేష్, వీరమల్ల రామకృష్ణ, కూనపరెడ్డి వీరవెంకటసత్యనారాయణ, కరుటూరి సరయ్య ,తెలుగుదేశం నాయకులు చోడవనిడి రామాంజనేయులు, పడాల శ్రీనివాస, ఇరింకి పెద్దిరాజుగ మరియు కూటమి నాయకులు పెరవలి మండల ఆర్ఐ ,గ్రామ కార్యదర్శి హర్ష మరియు గ్రామ రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

## కూటమి ప్రభుత్వంలోనే బీసీలకు రాజ్యాధికారం

మొదటిపేజి తరువాయి

అమలాపురంలో భారీ అంచనాలతో జరిగే శెట్టిబలిజల వన సమారాధనకు రాజకీయ పార్టీలకు అతీతంగా హాజరై సంఘ ఐక్యతను చాటాలని కోరారు. సంఘం పటిష్టత, ఐక్యత, రాజ్యాధికారం సాధన దిశగా సంఘీయులంతా కృషిచేయాలని సూచించారు. కూటమి ప్రభుత్వ హయాంలోనే బీసీలకు రాజ్యాధికారం సాధ్యమని, ఇందుకు తానే ఒక ఉదాహరణ అన్నారు.

ఈ కార్యక్రమంలో శెట్టిబలిజ కార్పొరేషన్ రాష్ట్ర చైర్మన్ కుడిపూడి సత్తిబాబు, సివిల్ సప్లయిస్ డైరెక్టర్ కడలి ఈశ్వరి, శెట్టిబలిజ సంఘ జిల్లా అధ్యక్షుడు చొల్లంగి వేణుగోపాల్, సివిల్ సప్లైస్ డైరెక్టర్ డాక్టర్ చప్పిడి వెంకటేశ్వరరావు, మాజీ ఎమ్మెల్యే పిల్లి సత్యనారాయణ మూర్తి, శ్రీనివాస బాబా, నురుకుర్తి వెంకటేశ్వరరావు, వాసంశెట్టి ఆంజనేయులు, పాలికి సతీష్, చొల్లంగి శ్రీను, గుబ్బలఅప్పారావు, పెద్ద ఎత్తున శెట్టిబలిజ సంఘీయులు తదితరులు పాల్గొన్నారు.

# లండన్ పర్యటనకు బయలుదేరిన మంత్రి కందుల దుర్గేష్

మొదటిపేజి తరువాయి

లండన్ పయనమయ్యారు. నవంబర్ 4 నుండి6 వరకు లండన్‌లో జరుగనున్న "వరల్డ్ ట్రావెల్ మార్కెట్ (WTM)-2025" గ్లోబల్ సమ్మిట్‌లో ఆయన పాల్గొననున్నారు. ఈ సదస్సులో పర్యాటక రంగానికి సంబంధించిన నూతన ఆవిష్కరణలు,పెట్టుబడుల అవకాశాలు,అంతర్జాతీయ భాగస్వామ్యాలపై చర్చలు జరగనున్నాయి. మంత్రి దుర్గేష్ ఈవేదిక ద్వారా రాష్ట్రపర్యాటక సామర్థ్యాలను ప్రపంచానికిపరిచయం చేయనున్నారు.స్థానిక ప్రజా ప్రతినిధులు, పార్టీనాయకులు, అధికారులు మంత్రి దుర్గేష్ పర్యటనకు శుభాకాంక్షలు తెలియజేశారు. పర్యాటక రంగంలో రాష్ట్రానికి కొత్త దిశా నిర్దేశం కలిగించే ప్రయత్నంగాఈపర్యటనను పలువురు అభినందించారు.

## వెలమ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో 'కింజరాపు 'కు ఘన నివాళులు



**జంగారెడ్డిగూడెం,మేజర్ న్యూస్ :** పట్టణ వెలమ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో తాండ్ర పాపారాయుడు సెంటర్లో మాజీ కేంద్ర మంత్రి కింజరాపు ఎర్రన్నాయుడు 13వ వర్ధంతి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పశ్చిమ గోదావరి జిల్లా వెలమ సంక్షేమ సంఘం ఉపాధ్యక్షులు డాక్టర్ రాజాన సత్యనారాయణ (పండు) మాట్లాడుతూ ఉత్తరాంధ్ర ముద్దు బిడ్డ సిక్కోలు సింహం,తెలుగు వాడి గొంతును ఢిల్లీలో బలంగా వినిపించిన ప్రజానేత,ఎంపీగా, కేంద్ర మంత్రిగా తెలుగు వారికి వన్నె తెచ్చిన నాయకుడు,వెలమ జాతి పటిష్టతకు ఎనలేని కృషి చేసిన వెలమ టైగర్ లోక్ సభ ప్యానెల్ స్పీకర్ స్వర్గీయ కింజరాపు యర్రంనాయుడు 13వ వర్ధంతి సందర్భంగా వారి పవిత్ర ఆత్మకు శాంతి కలగాలని కోరుకుంటున్నానన్నారు. వెలమ సంఘీయులు వారిని ఆదర్శంగా తీసుకొని వారి అడుగుజాడల్లో నడవాలని అన్నారు.ఈ కార్యక్రమంలో వెలమ సంక్షేమ సంఘం సభ్యులు, తాండ్ర పాపారాయుడు యూత్ సభ్యులు, వెలమ మహిళా కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

# గురుకుల పాఠశాల,భోజనశాలను తనిఖీ చేసిన న్యాయమూర్తులు

**భీమడోలు,మేజర్ న్యూస్ :** పోలసానిపల్లి అంబేడ్కర్ బాలికల గురుకులాన్ని జిల్లా న్యాయ సేవాధికారి సంస్థ కార్యదర్శి కె.రత్నప్రసాద్, ఉమ్మడిజిల్లా శాశ్వత లోక్ అదాలత్ చైర్పర్సన్ ఎ.మేరీ గ్రేస్ కుమారి ఆకస్మిక తనిఖీ చేసారు. ఆదివారం గురుకులంలోని వంటశాల, భోజనశాలను న్యాయమూర్తులు పరిశీలించారు. ఆహారాన్ని రుచి చూసారు. పరిసరాలను మరింత శుభ్రపరచాలని సిబ్బందికి సూచించారు. విద్యార్థులకు రుచితో పాటు సుచిగా ఆహారాన్ని అందించాలన్నారు.

# ఆదిత్య మహిళా డిగ్రీ కళాశాల విద్యార్థినుల సేవా కార్యక్రమం







**కాకినాడ, మేజర్ న్యూస్ :** స్థానిక సాంబమూర్తినగర్‌లో గల ఆదిత్య మహిళ డిగ్రీ కళాశాలకు చెందిన జాతీయ సేవా పథకం నిర్వహణాధికారులు, వాలంటీర్లు ది.02.11.2025 వ తారీఖున సామర్లకోట మండలం, పనసపాడు గ్రామ పంచాయతీ పరిసర గ్రామములో పర్యటించి సర్వే చేసినట్లు కళాశాల ప్రిన్సిపాల్ కె. కరుణ తెలిపారు.ఈ సందర్భంగా ఆదిత్య డిగ్రీ మరియు పి.జీ కళాశాలల అకడమిక్ డైరెక్టర్ డా॥ బి.యి.వి.ఎల్. నాయుడు మాట్లాడుతూ నవంబరు 8వ తేదీ నుండి 14వ తేదీ వరకు ఆదిత్య మహిళ డిగ్రీ కళాశాల జాతీయ సేవా పథకం యూనిట్ -2 వారు ప్రత్యేక సేవా శిబిరం ఏర్పాటుచేయనున్నారు అని తెలిపారు. ఈ కార్యక్రమంలో భాగంగా 7 రోజులపాటు గ్రామంలో వివిధ కార్యక్రమాలు నిర్వహించేందుకు అనుగుణంగావున్న గ్రామాలను చూసుకుని సర్వే నిర్వహించి వారి అవసరాలకు అనుగుణంగా వాలంటీర్ల ద్వారా సేవా కార్యక్రమాలు నిర్వహిస్తారని తెలిపారు. ఆదిత్య మహిళ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ కె. కరుణ మాట్లాడుతూ 7రోజు ప్రత్యేక సేవా శబిరంలో ఉచిత వైద్యసదుపాయం, పరిసరాల పరిశుభ్రత, మొక్కలు నాటటం, వివిధ అంశాలపై ప్రజలలో అవగాహన తీసుకువచ్చే ర్యాలీలు నిర్వహించటం, స్థానిక పాఠశాలలో విద్యార్థులకు భవిష్యత్తు ప్రణాళికలు, వివిధ కోర్సులగురించి అవగాహన కల్పించటం, గ్రామంలో సమస్యలపై విశ్లేషణ తదితర కార్యక్రమాలను నిర్వహించనున్నారని ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో భాగంగా ముందస్తు ప్రణాళికలు సిద్ధంచేయుటకు ముందుగా పర్యటించి ఒక నివేదికను తయారుచేయుటకు ఈరోజున ఎన్.ఎస్.ఎస్. విభాగం వారు స్థానిక పనసపాడు గ్రామములో సర్వే నిర్వహించినట్లు ఆమె తెలిపారు.

ఈ కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపల్ జి.నాగ శ్రీకాంత్, జాతీయ సేవా పథక కార్యనిర్వహణాధికారి పి. సురేఖ దేవి, ఫిజికల్ డైరెక్టర్ యన్.సత్యవతి మరియు 49 మంది వాలంటీర్లు పాల్గొన్నారు.

# మహిళల క్రికెట్ వరల్డ్ కప్ ఫైనల్లో ఇండియా విజయం సాధించాలి

**కాకినాడ, మేజర్ న్యూస్ :** మహిళల క్రికెట్ వరల్డ్ కప్ ఫైనల్లో ఇండియా జట్టు విజయం సాధించాలి కోరుతూ కాకినాడ సిటీ శాసనసభ్యులు వనమాడి కొండబాబు ఆధ్వర్యంలో తెలుగుదేశం పార్టీ శ్రేణులు ఆదివారం దేవాలయాలు, మసీదు, చర్చిల నందు ప్రత్యేక పూజలు, ప్రార్థనలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్.కె.రహీమ్, అంబటి చిన్న, గుమ్మల్ల వెంకటేశ్వర్లు మాట్లాడుతూ మహిళల క్రికెట్ వరల్డ్ కప్ ఫైనల్లో ఇండియా జట్టు విజయం సాధించాలని నేడు దేవాలయాలు మసీదులలో చర్చల నందు ప్రత్యేక ప్రార్థనలు పూజలు నిర్వహించడం జరిగిందని తెలుగుదేశం పార్టీ ఎప్పుడు మహిళలను ప్రోత్సహించడం జరుగుతుందని, ఇది క్రీడలను ప్రోత్సహించడం మహిళలు జట్టుకు మద్దతు అని పేర్కొన్నారు.

ఈ కార్యక్రమంలో ఎస్కే రహీమ్, అంబటి చిన్న, ఎం.డి. ఖాన్, గుమ్మల్ల వెంకటేశ్వరరావు, ఎం.డి. అన్సర్, అశ్రిఫ్ అలీ, బుల్లోజు ఉమామహేశ్వరరావు, ఖాదర్ వలీ ఖాన్, ముడే రాజబాబు, షేక్



అన్వర్, పోలిపల్లి జగన్, గబ్బర్ సింగ్, బొడ్డుపల్లి నాని, జారుఖాన్ తదితరులు పాల్గొన్నారు.

# జగన్మోహిని కేశవ స్వామి ఆలయానికి పోటెత్తిన భక్తులు



## - అన్నదాన ట్రస్ట్‌కు విరాళాలు

**ఆత్రేయపురం, మేజర్ న్యూస్ :** ప్రసిద్ధ పుణ్యక్షేత్రం ర్యాలి శ్రీ జగన్మోహిని కేశవ & గోపాలస్వామివారి ఆలయానికి క్షీరాబ్ది ద్వాదశి సందర్భంగా భక్తులు పోటెత్తారు. వేలాది మంది భక్తులు స్వామివారిని దర్శించి మొక్కుబడులు తీర్చుకున్నారు. అన్నప్రసాదాలు స్వీకరించారు. నిత్య అన్నదాన పథకానికి అత్తిలికి చెందిన అనంతపల్లి రాంబాబు, సీతమహాలక్ష్మి దంపతులు రూ.5,116లు; తాడేపల్లిగూడెంకు చెందిన ఇమంది కోదండ రామప్రసాద్, నాగ మల్లేశ్వరి, దంపతులు రూ.5,116లు విరాళంగా అందించారు. దాతలకు ఆలయ అర్చకులు వేదమంత్రాలతో ఆశీర్వచనం చేయించారు. దాతలకు ఆలయ ఈవో భాగవతుల వెంకటరమణమూర్తి స్వామివారి చిత్రపటం అందించారు.

# కక్ష రాజకీయాలకు నిదర్శనమే చిన అప్పన్న అరెస్ట్

- పవిత్ర తిరుమల వేదికగా చంద్రబాబు వికృత రాజకీయం
- తిరుమల లడ్డు ప్రసాదంలో జంతు కొవ్వు అంటూ దుష్ప్రచారం
- అబద్ధాన్ని నిజం చేసేందుకు చిన అప్పన్న అరెస్టు



**కాకినాడ,మేజర్‌న్యూస్ :** పవిత్ర పుణ్యక్షేత్రం తిరుమల వేదికగా చంద్రబాబు వికృత రాజకీయాలు చేస్తున్నారని మండిపడ్డారు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ మహిళా విభాగం రాష్ట్ర ఉపాధ్యక్షురాలు జమ్మలమడక నాగమణి. తిరుమల లడ్డు ప్రసాదం కల్తీ అంటూ వైసిపి సీనియర్ నేత మాజీ ఎంపి వై.వి.సుబ్బారెడ్డిపై కక్షసాధింపు చర్యలకు కూటమి ప్రభుత్వం కాలు దువ్వుతోందని పేర్కొన్నారు. ఈ మేరకు ఆదివారం నాగమణి పత్రికా ప్రకటన విడుదల చేసారు. ముఖ్యమంత్రి చంద్రబాబు చేసిన ఆరోపణలపై వై.వి. సుబ్బారెడ్డి విచారణ కోరుతూ సుప్రీంకోర్టును ఆశ్రయించిన విషయాన్ని గుర్తు చేసారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి తొక్కిసలాట ఘటనలు జరగడం విస్మయానికి గురి చేస్తోందన్నారు. ముందు తిరుమల, సింహాచలం, ఇప్పుడు కాశీబుగ్గలో జరిగింద న్నారు. ప్రతీసారి అభం శుభం తెలియని భక్తులు ప్రాణాలు కోల్పోతు న్నారని పేర్కొన్నారు. ఇటువంటి ఘటనలు ప్రజల్లోకి వెళ్లకుండా పక్కదోవ పట్టించేందుకు కొత్త విషయాన్ని తెరపైకి తీసుకురావడం కూటమి ప్రభుత్వానికే చెల్లిందన్నారు. తాము చేస్తున్న తప్పులను కప్పిపుచ్చుకునేందుకు అడ్డదారులు తొక్కడం సరికాదన్నారు.. వై.వి. సుబ్బారెడ్డి దగ్గర గతంలో పనిచేసిన చిరు ఉద్యోగి చిన అప్పన్నను అరెస్టు చేయడం దారుణమన్నారు. వాస్తవానికి టిడిపి ఎంపి వేమిరెడ్డి ప్రభాకరరెడ్డి వద్ద కూడా పని చేసారని తెలిపారు. చంద్రబాబుపై స్కిల్ డెవలప్మెంట్ కేసు నమోదైనప్పుడు ఆయన పిఏ శ్రీనివాస్ విదేశాలకు పారిపోయారన్న నాగమణి.. తప్పు చేయలేదు కాబట్టే వైసిపి నేతలు ధైర్యంగా రాష్ట్రంలో ఉంటున్నారని తెలిపారు. అటువంటివారిపై కూటమి ప్రభుత్వం కక్ష సాధింపు చర్యలకు పాల్పడటం సమంజసం కాదని అభిప్రాయపడ్డారు.

## శ్రీశ్రీ మరిడమ్మ అమ్మవారి దేవస్థానం నందు అన్నదానం - పాల్గొన్న భక్తులు



**పెద్దాపురం, మేజర్ న్యూస్ :** పెద్దాపురం పట్టణంలో వేంచేసియున్న శ్రీశ్రీశ్రీ మరిడమ్మ అమ్మవారి దేవస్థానం నందు ఆదివారం దేవస్థాన అసిస్టెంట్ కమీషనర్ కె.విజయలక్ష్మి ఆధ్వర్యంలో అమ్మవారి దర్శనానికి సుదూర ప్రాంతాల నుండి వచ్చు భక్తులకు అన్నప్రసాద వితరణ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భక్తులు అమ్మవారిని దర్శించుకుని, అన్నప్రసాదం స్వీకరించారు.ఈకార్యక్రమంలోవేదపండితులు ఐ.వి. ప్రసాదశర్మ, ఎన్.వి.శాస్త్రి, శంకర శాస్త్రి, ఆసాదులు రాయ రామ చంద్రప్రసాద్ (నాని),రాయ విజయ్‌కుమార్, సిబ్బంది వెంకటరమణ, క్రాంతివీర్, గౌరి, వరహాలు, లోవ, శివ తదితరులు పాల్గొన్నారు.

## పేరు మార్పు

యిందుమూలముగా తెలియజేయునది ఏమనగా పెద్దాపురం మండలం, చినబ్రహ్మాదేవం గ్రామానికి చెందిన మత్తూర్తి ఝాన్సీలక్ష్మి, D/o శ్రీనివాస్ తన కుమార్తె పేరు ఆధార్ కార్డ్ నందు మత్తూర్తి దేవీప్రియ అని తప్పుగా నమోదు కాబడినది. తన అసలు పేరు మత్తూర్తి ఝాన్సీలక్ష్మిగా ఉన్నదని తెలియ జేయుచున్నాను.

మత్తూర్తి శ్రీనివాస్
డోర్ నెం.3-28/2, చినబ్రహ్మాదేవం, పెద్దాపురం మండలం.

సూర్య www.suryaa.com

మీరు చందాదారులుగా చేరాలనుకుంటున్నారా..
సకాలంలో పేపరు అందడం లేదా...
సంప్రదించండి సెల్ : 9989800678

అతి తక్కువ ఖర్చుతో పుట్టినరోజు, వివాహ వేడుక, పదవీ విరమణ, ప్రారంభోత్సవం, శ్రద్ధాంజలి, పేరు మార్పు, లీగల్ ప్రకటనలకు, మీ కార్యక్రమాలకు సంబంధించిన వార్తలు ఏవైనా సరే సంప్రదించండి. సెల్ : 9032209779

# మాజీ మంత్రి జోగి అరెస్టు హాస్యాస్పదం

- చీప్ లిక్కర్ దందా చేసింది టిడిపి నేతలు
- అసలు దొంగలను వదిలి బిసిలపై కక్ష సాధింపా
- వైఎస్సార్ సిపి మహిళా విభాగం రాష్ట్ర ఉపాధ్యక్షురాలు జమ్మలమడక నాగమణి



**కాకినాడ, మేజర్ న్యూస్ :** రోమ్ నగరం తగలబడుతుంటే నీరో చక్రవర్తి ఫిడేల్ వాయించిన చందంగా ముఖ్యమంత్రి చంద్రబాబు తీరు ఉందని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ మహిళా విభాగం రాష్ట్ర ఉపాధ్యక్షురాలు జమ్మలమడక నాగమణి ఎద్దేవా చేసారు. ఒక పక్క మొంథా తుపాను ప్రభావంతో రైతులు అల్లాడుతుంటే., సైక్లోన్ ఫైటర్స్ కు అవార్డుల ప్రదానం ఏంటని ప్రశ్నించారు. టిడిపి నేతలు చేసిన అక్రమ వ్యాపారానికి వైసిపి నేతల అరెస్టులతో డైవర్షన్ పాలిటిక్స్‌కు తెరలేపారని మండిపడ్డారు. మాజీ మంత్రి, వైసిపి సీనియర్ నేత జోగి రమేష్ అరెస్టును ఆదివారం విడుదల చేసిన ఒక ప్రకటనలో తీవ్రంగా ఖండించారు జమ్మలమడక నాగమణి. కూటమి ప్రభుత్వం తీరు దొంగే దొంగ దొంగ అని అరిచినట్టుందని ఎద్దేవా చేసారు. రాష్ట్ర వ్యాప్తంగా కుటీర పరిశ్రమలు ఏర్పాటు చేసి నకిలీ మద్యం తయారు చేసింది టిడిపి నేతలైతే జోగి రమేష్‌ను అరెస్టు చేయడం ఏంటని ప్రశ్నించారు. తంబళ్లపల్లి నియోజకవర్గం ఇంచార్జ్ జయచంద్రారెడ్డి అనుచరుడు జనార్ధనరావు ఈ కేసులో కీలక సూత్రధారి అని తేలిందని, మరి ఇప్పట వరకు జయచంద్రారెడ్డిని ప్రశ్నించారా అని నిలదీశారు నాగమణి.. బిసి ల తోకలు కత్తిరిస్తాన్న చంద్రబాబు వ్యాఖ్యలు, రాష్ట్రవ్యాప్తంగా గుర్తింపు ఉన్న బిసి నేత జోగి అరెస్టుతో వెనుకబడినవర్గాల పట్ల ఏ విధంగా ప్రజలకు అర్ధం అవుతుందన్నారు. కాశీబుగ్గ తొక్కిసలాట ఘటనను డైవర్ట్ చేసేందుకే మాజీ మంత్రి జోగి రమేష్ అరెస్టు డ్రామాకు చంద్రబాబు ప్రభుత్వం తెరలేపిందని జమ్మలమడక నాగమణి ఆరోపించారు.

# కన్నుల పండువుగా క్షీరాబ్ది ద్వాదశి వేడుకలు





- వైభవంగా స్వామి వారి తెప్పోత్సవం
- నిత్య అన్నదాన పథకానికి విరాళం

**ఆత్రేయపురం, మేజర్ న్యూస్ :** కోనసీమ తిరుమలగా విరాజిల్లుతున్న వాడపల్లి వేంకటేశ్వర స్వామివారి ఆలయంలో క్షీరాబ్ది ద్వాదశి వేడుకలను కన్నుల పండువుగా జరిగాయి. వేలాది మంది భక్తజనంతో పరిసరాలన్నీ గోవిందనామ స్మరణతో ప్రతిధ్వనించాయి. క్షీరాబ్ది ద్వాదశి సందర్భంగా గౌతమి గోదావరిలో స్వామివారి తెప్పోత్సవం కన్నుల పండువుగా జరిగింది. స్వామివారి వసంత మండపంలో ఏడు వారాలు నోము పూర్తయిన భక్తులు అష్టోత్తర పూజలు, కళ్యాణం పూజల్లో పాల్గొని మొక్కులు తీర్చుకున్నారు. శ్రీ స్వామివారిని దర్శించుకుని అన్నప్రసాదాలు స్వీకరించారు. స్వామివారి తెప్పోత్సవ కార్యక్రమంలో చైర్మన్ ముదునూరి వెంకటరాజు, డిప్యూటీ కమిషనర్ నల్లం సూర్య చక్రధర్ రావు పాల్గొని ఏర్పాట్లు పర్యవేక్షించారు.

నిత్య అన్నదాన పథకానికి భీమడోలుకు చెందిన మహాదేవుని వెంకట భీమేష్ వర్మ, అశ్రీత దంపతులు, వారి కుటుంబ సభ్యులు రూ. 50,116లు విరాళంగా అందించారు. వీరికి ఆలయ అర్చకులు వేదమంత్రాలతో ఆశీర్వచనాలు అందించారు. ఆలయ జూనియర్ అసిస్టెంట్, వై.శ్రీను శ్రీ స్వామివారి చిత్రపటం అందించారు.

# 'ఏకలవ్య'లో కల్చరల్ ఫెస్ట్‌కు సర్వం సిద్ధం!

- ఐటీడీఏ పీవో స్మరణ్ రాజ్ ఏర్పాట్లు పరిశీలన



**రంపచోడవరం, మేజర్ న్యూస్ :** ఈనెల మూడో తేదీ నుండి ఐదో తేదీ వరకు మూడు రోజులపాటు మారేడుమిల్లి ఏకలవ్య మోడల్ స్కూల్ ఆవరణలో రాష్ట్రస్థాయిలో ఈ ఆర్.ఎం.ఎస్. రెసిడెన్షియల్ పాఠశాలల కల్చరల్ ఫెస్ట్ నిర్వహించడం జరుగుతుందని రంపచోడవరం ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి బి.స్మరణ్ రాజ్ పేర్కొన్నారు. ఈ ఈవెంట్ నిర్వహణకు జరుగుతున్న ఏర్పాట్లను ఆదివారం ఐటీడీఏ పీవో పరిశీలించారు. ఈ సందర్భంగా ఐటీడీఏ ప్రాజెక్ట్ అధికారి స్మరణ్ రాజ్ మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ పాఠశాలలకు సంబంధించిన కళా ఉత్సవ్-2025 సంవత్సరంలో అల్లూరి సీతారామరాజు జిల్లా మారేడుమిల్లి ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ పాఠశాలలో కల్చరల్ కాంపిటిషన్స్, కల్చరల్ ప్రోగ్రామ్స్ నిర్వహించడం జరుగుతుందన్నారు. అదేవిధంగా ఈ కార్యక్రమానికి రాష్ట్ర మంత్రి, శాసనసభ్యులు, శాసనమండలి సభ్యులు, జిల్లా పరిషత్ చైర్మన్, వివిధ శాఖల ఐ.ఏ.ఎస్ అధికారులు, ప్రజాప్రతినిధులను ఆహ్వానించడం జరిగిందని ఆయన తెలిపారు. ఈ మూడు రోజులపాటు జరిగే ఈ కళా ఉత్సవ్-2025 కార్యక్రమానికి అన్ని ఏర్పాట్లు సిద్ధం చేయడం జరిగిందని ఆయన తెలిపారు. అదేవిధంగా మూడు రోజులు పాటు జరిగే కార్యక్రమాలకు సంబంధించి ఏర్పాట్లను ప్రాజెక్టు అధికారి పరిశీలించారు. ప్రాజెక్ట్ అధికారి వెంట గురుకులాల జాయింట్ సెక్రెటరీ ప్రసాద్, గిరిజన సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్ రుక్మాండయ్య, ఈఆర్ఎంఎస్ ప్రిన్సిపాల్ శంకర్ ప్రసాద్, తాసిల్దార్ బాలాజీ, ఎంపీడీవో కిషోర్ పాల్గొన్నారు.

## గోరింటలో 63వ వార్షికోత్సవ ఏకాహాంలో పాల్గొన్న భజన సమాజాలు

- పలువురికి సన్మానం
- శ్రీ శివరామ బాలభక్త భజన సమాజం అధ్యక్షులు పచ్చిపాల ప్రసాదరావు



**పెద్దాపురం రూరల్, మేజర్ న్యూస్ :** పెద్దాపురం మండలం గోరింట గ్రామంలో పెద రామాలయం వద్ద స్వస్తి శ్రీ ఛాంద్రామన శ్రీ విశ్వవసు నామ సంవత్సర కార్తిక ఏకాదశి పురస్కరించుకుని, నవంబర్ 1వతేదిన ఏకాదశి సందర్భంగా ఏకాహా భజన కార్యక్రమం నిర్వహించడంలో భాగంగా, శ్రీ శివరామ బాలభక్త భజన సమాజం అధ్యక్షులు మరియు ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా శ్రీ విఘ్నేశ్వర భజన కళాకారుల సంక్షేమ సంఘం జాయింట్ సెక్రటరీ పచ్చిపాల ప్రసాదరావు, ఆలయ కమిటి సభ్యులు ఆధ్వర్యంలో భజన కార్యక్రమంలో పాల్గొన్న పలువురు భజన కళాకారులను సన్మానించడం జరిగింది. ఈ సందర్భంగా ఆయన తెలుపుతూ ఈ ఏకాహాం కార్యక్రమంకు సహకరించిన గ్రామ పురోహితులు గోవిందవర్జుల శ్రీనివాసశర్మకు, ఆలయ కమిటి సభ్యులకు, గ్రామ నాయకులు, తోటి సమాజ సభ్యులకు, భజన కళాకారులకు, భజన సంఘాలకు అలాగే గ్రామ ప్రజలుకు సహకరించినందుకు ఆయన ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం పలువురు భజన కళాకారులను సన్మానించడం జరిగింది.

## మరిడమ్మ అమ్మవారి దేవస్థానం నందు కార్తీక మాసం పురస్కరించుకుని ప్రత్యేక పూజలు

- పాల్గొన్న అసిస్టెంట్ కమీషనర్ కె.విజయలక్ష్మీ



**పెద్దాపురం రూరల్, మేజర్‌న్యూస్ :** పెద్దాపురం పట్టణంలో వేంచేసియున్న శ్రీశ్రీశ్రీ మరిడమ్మ అమ్మవారి దేవస్థానం నందు ఆదివారం దేవస్థాన అసిస్టెంట్ కమీషనర్ కె.విజయ లక్ష్మీ ఆధ్వర్యంలో కార్తీకమాసం చిలుకుల ద్వాదశి సందర్భంగా అమ్మవారి దేవస్థానం నందు లక్ష్మీదేవి మరియు శ్రీహరి కొలువైయున్న తులసిమొక్క, ఉసిరి చెట్టునకు పూజా కార్యక్రమాలు నిర్వహించారు. దీనిలో భాగంగా భక్తులు దర్శించుకున్నారు. ఈకార్యక్రమంలోవేదపండితులు ఐ.వి.ప్రసాదశర్మ, ఎన్.వి.శాస్త్రి, శంకర శాస్త్రి, ఆసాదులు రాయ రామచంద్రప్రసాద్ (నాని), రాయ విజయ్ కుమార్, సిబ్బంది వెంకటరమణ, క్రాంతివీర్, గౌరి, వరహాలు, లోవ, శివ తదితరులు పాల్గొన్నారు.

## నేడు యదావిధిగా 'ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ' నిర్వహణ

- ఆర్డీఓ శ్రీరమణి



**పెద్దాపురం,మేజర్‌న్యూస్ :** సోమవారం పెద్దాపురం ఆర్డీఓ కార్యాలయంలో ఉదయం 10 గంటల నుండి ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ జిల్లా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు నిర్వహణ జరుగుతుందని, ఆర్డీఓ కె.శ్రీరమణి తెలిపారు. కావున డివిజన్‌లోని 11 మండలాల పరిధిలో గల ప్రజలు ఈ ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థను సద్వినియోగం చేసుకోవలసినదిగా ఆమె తెలిపారు.

# తుఫాను బాధితులకు అండగా కూటమి ప్రభుత్వం





కాకినాడ రూరల్, మేజర్ న్యూస్ : ఇటీవల ఏపీపై విరుచుకుపడిన 'మొంథా' తుఫాను కారణంగా సముద్రంలోకి వేటకు వెళ్లలేక, పడవులు దెబ్బతిని జీవనోపాధి కోల్పోయిన మత్స్యకార కుటుంబాలకు అండగా కూటమి ప్రభుత్వం నిలిచింది. తుఫాను తాకిడికి గురైన కాకినాడ రూరల్ నియోజకవర్గం పరిధిలోని పర్లాపేట, తూరంగి పగడాలపేట గ్రామాల్లోని మత్స్యకార కుటుంబాలకి ఆదివారం అత్యవసర సహాయం కింద నిత్యావసర సరకులు పంపిణీ చేశారు.

గుర్తింపు పొందిన ప్రతి మత్స్యకార కుటుంబానికి తక్షణ సహాయంగా 50 కేజీల బియ్యం, ఒక కేజీ పంచదార, ఒక కేజీ పప్పు దినుసులు, ఒక లీటర్ వంట నూనెతో సహా ఇతర నిత్యావసర సరుకులు అందజేశారు. ప్రభుత్వం అందించిన ఈ సహాయం తాత్కాలికంగానైనా తమ కష్టాలను తీరుస్తుందని బాధితులు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా కాకినాడ రూరల్ ఎమ్మెల్యే పంతం వెంకటేశ్వరరావు (నానాజీ) మాట్లాడుతూ, తుఫాను వల్ల నష్టపోయిన ప్రతి కుటుంబానికి ప్రభుత్వం అండగా ఉంటుందని, జీవనోపాధిని పునరుద్ధరించడానికి త్వరలోనే మరిన్ని సహాయక చర్యలు చేపడతామని హామీ ఇచ్చారు. మత్స్యకారుల సంక్షేమానికి కూటమి ప్రభుత్వం ఎల్లప్పుడూ కృషి చేస్తుందని ఆయన భరోసా ఇచ్చారు.

ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ కర్రీ పద్మశ్రీ, మాజీ మంత్రి చిక్కాల రామచంద్రరావు, కాకినాడ రూరల్ టీడీపీ సీనియర్ నాయకులు, మాజీ జడ్పీటీసీ నులుకుర్తి వెంకటేశ్వరరావు, జిల్లా టీడీపీ ప్రధాన కార్యదర్శి పెంకే శ్రీనివాస్ బాబా, శెట్టిబలిజ కార్పొరేషన్ డైరెక్టర్ డా. చప్పిడి వెంకటేశ్వరరావు, కాకినాడ రూరల్ కో ఆర్డినేటర్ కటకంశెట్టి ప్రభాకర్ (బాబి), ఎంపీపీ అనంతలక్ష్మి త్రిమూర్తులు, కూటమి నాయకులు రంబాల వెంకటేశ్వరరావు, పితాని లీలావతి, కరెడ్ల గోవింద్, సాండీ, రవి, పెద్ద రాజులు తదితరులు పాల్గొన్నారు.

## ఆర్యవైశ్య మినీ కళ్యాణ మండపం నిర్మాణానికి శంకుస్థాపనకు నిర్వహించిన ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ

గండేపల్లి, మేజర్ న్యూస్ : గండేపల్లి ఆర్యవైశ్య సంఘం వారి మినీ కళ్యాణ మండపం శంకుస్థాపనకు జగ్గంపేట శాసనసభ్యులు జ్యోతుల నెహ్రూ ముఖ్యఅతిథిగా హాజరై ఆర్యవైశ్య మినీ కళ్యాణ మండపం కు కొబ్బరికాయ కొట్టి శంకుస్థాపన కార్యక్రమం నిర్వహించారు. అనంతరం ఆర్యవైశ్య వనభోజనాల్లో పాల్గొని సహబంతి భోజనాలు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గండేపల్లి ఆర్యవైశ్యులకు ఏ అవసరం వచ్చినా నేను ముందుంటానని మినీ కళ్యాణ మండపం నిర్మాణానికి ప్రభుత్వ సహకారం కూడా అందిస్తామని నా సహాయ సహకారాలు కూడా అందిస్తారని అన్నారు. స్థలం కేటాయించి, భవన నిర్మాణానికి సహకరిస్తున్న ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూకి ఆర్యవైశ్యుల ఆధ్వర్యంలో ఘన సన్మానం నిర్వహించి కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో జల్లూరి ప్రదీప్, మామిడిపాక వెంకటరత్నం, వాకచర్ల బాబ్జి, వాకచర్ల నాగేశ్వరరావు, వాకచర్ల గోపి, మాతంశెట్టి రాము, సత్యవరపు బాబి, సత్య వరపు ప్రసాద్, ఎలమాటి కాశి, రెడ్డి సుబ్బారావు, చాగంటి సత్యనారాయణమూర్తి, వెంపాటి రాజు, మాగంటి బాబి, ఇప్పర్ల బాబి, తదితరులు పాల్గొన్నారు.



# ఆదివాసీ హక్కులు, ఉద్యోగాల సాధనకై పోరుబాట



**– డిసెంబర్ 15న రంపచోడవరంలో బహిరంగ సభ**

రంపచోడవరం, మేజర్ న్యూస్ : ఆదివాసీ హక్కులు, ఉద్యోగాల సాధనకై పోరుబాట నిర్వహించనున్నామని, అందులో భాగంగా డిసెంబర్ 15న రంపచోడవరంలో బహిరంగ సభ జరుగుతుందని ఆదివాసీ నాయకులు ఆదివారం తెలిపారు. గంగవరం మండల కేంద్రంలో ఆదివాసీ హక్కులు, ఉద్యోగాల సాధన కమిటీ గౌరవ అధ్యక్షులు ఈతపల్లి సిరిమల్లి రెడ్డి, డివిజన్ అధ్యక్షులు మడి మురళీ దొర ఆధ్వర్యంలో 5వ షెడ్యూల్డ్ ప్రాంత ఉద్యోగాల నియమకాల చట్టం, ఆదివాసీ హక్కులు, చట్టాలు, 100 శాతం ఉద్యోగాలు సాధన కోసం సమావేశం నిర్వహించడం జరిగిందన్నారు. ఈ సమావేశంలో ఐదో షెడ్యూల్ ప్రాంతంలో అన్ని ఉద్యోగాలు ఆదివాసీలకే కేటాయించాలనే ఆదివాసీలు డిమాండ్ ను ప్రభుత్వం పట్టించుకోలేదన్నారు. 1/70 చట్టం, పెసా చట్టం, అటవీ హక్కుల చట్టం, 2013 పోలవరం భూసేకరణ చట్టాలు ఇప్పటికీ పటిష్టంగా అమలు కాకుండా అధికారులు, ప్రజా ప్రతినిధులు, ప్రభుత్వం కుట్ర చేస్తుందన్నారు. ఐదో షెడ్యూల్డ్ ప్రాంతంలో అన్ని శాఖల్లో ఉద్యోగాలు కేటాయించకుండా నిర్లక్ష్యంగా వ్యవహరించడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. ఆదివాసీ హక్కులు, చట్టాలు, ఆదివాసీ నిరుద్యోగుల డిమాండ్లను డిసెంబర్ 15వ తేదీలోగా పరిష్కరించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నామన్నారు. రంపచోడవరం డివిజన్ లో ప్రభుత్వం అక్రమంగా భూములు కొనుగోలు చేసే పక్రియను తక్షణమే నిలిపివేయాలని డిమాండ్ చేస్తున్నామన్నారు. ఈ డిమాండ్లు ప్రభుత్వం పరిష్కరించని పక్షంలో ప్రజా క్షేత్రంలో ఆదివాసీ హక్కులు, ఉద్యోగాల సాధన పోరుబాటలో తేల్చుకుంటామని ఆదివాసీ నాయకులు పేర్కొన్నారు.

ఈ కార్యక్రమం ఆదివాసీ నాయకులు మద్దేటి అంజిరెడ్డి, కత్రం దాసు, వెదుళ్ళ లచ్చిరెడ్డి, తెల్లం శేఖర్, తాము సూరిబాబు, వంతు బాలకృష్ణ, పండా కృష్ణ మూర్తి దొర, కుంజం తమన్నదొర, మడిగుంట వెంకటేశ్వరావు, గుమ్మడి లోవ ప్రసాద్, చవలం శశి ప్రీతం, ఈక సుధా కిరణ్, ఏ.ఐ.కె.ఎం.ఎస్ ఉపాధ్యక్షులు ఐ.రమణ, బి.అశోక్ కుమార్ రెడ్డి పాల్గొన్నారు.

## కార్తీకమాసం భక్తుల రద్దీ దృష్ట్యా అధికారులు తగు ఏర్పాట్లు చెయ్యాలి



సామర్లకోట, మేజర్ న్యూస్ : కార్తీకమాసం పురస్కరించుకుని భక్తుల రద్దీ దృష్ట్యా అధికారులు తగు ఏర్పాట్లు చెయ్యాలని కోరుతూ జిల్లా మానవ హక్కుల సంఘ నాయకులు సామర్లకోట భీమేశ్వర ఆలయ కార్యనిర్వహణాధికారి బల్ల నీలకంఠం కు వినతిపత్రం అందచేశారు.. ఈ సందర్భంగా మానవ హక్కుల సంఘ అధ్యక్షులు నూతలపాటి అప్పలకొండ మాట్లాడుతూ శ్రీకాకుళం జిల్లా కాశీబుగ్గలో జరిగిన సంఘటనను దృష్టిలో ఉంచుకుని ఆలయాల్లో భక్తుల రద్దీ ఏర్పడకుండా అధికారులు తగు చర్యలు చేపట్టాలని అన్నారు.. కార్తీకమాసం కావడంతో రాష్ట్ర నలుమూలల నుండి పెద్ద ఎత్తున భక్తులు ఆలయానికి రానున్నందున అధికారులు తగు ఏర్పాట్లు చేయాలని కోరారు. కార్యక్రమంలో మానవ హక్కుల సంఘ నాయకులు కుంచె నానిబాబు, జుత్తుక అప్పారావు, వల్లీ భాషా తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థినిలకు గంజాయి, సైబర్ క్రైమ్స్‌పై అవగాహన కల్పించిన పోలీసులు




రాజవొమ్మంగి, మేజర్ న్యూస్ : రాజవొమ్మంగి ఏ పి టీ డబ్ల్యూ ఆర్ బాలికల పాఠశాల నందు ఆదివారం స్థానిక ఎస్సై శివకుమార్ ఉమెన్స్ భద్రత, గంజాయి, సైబర్ క్రైమ్స్ పైవిద్యార్థినులకు అవగాహన కల్పించారు. స్థానిక సీఐ గౌరీ శంకర్ ఆధ్వర్యంలో కార్యక్రమం నిర్వహించడం జరిగింది.

**మహిళల్లో క్రీడా స్ఫూర్తిని పెంపొందించేందుకు చిన్న ప్రయత్నం**

**– దేశం నాయకులు**




ఏలేశ్వరం, మేజర్ న్యూస్ : మహిళల్లో క్రీడా స్ఫూర్తిని పెంపొందించేందుకే ఎల్ఈడి స్క్రీన్ ప్రదర్శన ఏర్పాటు చేయడం జరిగిందని దేశం పార్టీ నాయకులు బుదిరెడ్డి గోపాలకృష్ణ అన్నారు. ఆదివారం ఏలేశ్వరం టిడిపి కార్యాలయంలో మధ్యాహ్నం 3 గంటలకు నవి ముంబైలోని పాటిల్ స్టేడియంలో భారత్ – దక్షిణాఫ్రికా మధ్య ఫైనల్ జరుగనున్న సందర్భంగా ఎల్ఈడీ స్క్రీన్ ఏర్పాటు చేయడం జరిగింది. పెద్ద సంఖ్యలో మహిళలు, అభిమానులు హాజరై మ్యాచ్ వీక్షిస్తున్నారు. ఈ సందర్భంగా బొద్దిరెడ్డి గోపాలకృష్ణ మాట్లాడుతూ ప్రతిపాడు నియోజకవర్గ శాసనసభ్యురాలు వరుపుల సత్యప్రభ ఆదేశాల మేరకు ఎల్ఈడి స్క్రీన్ ఏర్పాటు చేయడం జరిగిందని ఆయన అన్నారు. భారత మహిళా జట్టు ప్రదర్శన దేశానికి గర్వకారణమని,ఫైనల్‌లో విజయం సాధించి ప్రపంచానికి భారత మహిళల ప్రతిభను చాటాలని ఆకాంక్షించారు. జట్టు సభ్యులకు ఆయన హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. విద్యార్థులు మహిళలు క్రీడలను వీక్షించడం స్ఫూర్తి నెలకొని వారిలో దాగున్న సృజనాత్మక శక్తి బయటపడుతుందన్నారు. దీన్ని స్ఫూర్తిగా తీసుకుని బావి పౌరులు క్రీడల పై ఆసక్తిని పెంపొందించుకొనేందుకు ఆస్కారం కలుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు మూది నారాయణస్వామి, ఎండగుండి నాగబాబు, రాయుడు చిన్న, సామంతుల గోపి,రుచి రమేష్, తదితరులు పాల్గొన్నారు.

# భావకవి దేవులపల్లి వేంకట కృష్ణ శాస్త్రి జయంతి



**సామర్లకోట, మేజర్ న్యూస్ :** దేవులపల్లి కృష్ణశాస్త్రి (నవంబర్ 1, 1897 – ఫిబ్రవరి 24, 1980) ఒక తెలుగు కవి మాత్రమే కాదు. తెలుగు వారు గర్వించదగ్గ కవి అని సామర్లకోట తహసీల్దార్ కే. చంద్ర శేఖర్ రెడ్డి అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భావ కవిత్వాన్ని కొత్త పుంతలు తొక్కించిన కవి. పువ్వు పుట్టగానే పరిమళి0చినట్లుగా 10 ఏళ్లకే తోలి గేయాన్ని రచించిన, 16 ఏళ్లకే అష్టావదానాన్ని చేసిన విద్వత్తు ఆయనది. పాతికేళ్ళు నిండకుండానే అయన ప్రకృతినుండి లభించిన ప్రేరణ కారణంగా వెలువరించిన తొలి భావ కావ్యం కృష్ణపక్షం ఈయన కవితాశైలికి ప్రత్యేక గుర్తింపు తెచ్చింది. తెలుగువారిని అలరించింది. అప్పుడు ప్రారంభించిన సాహితీ కృషి ఆయన గొంతు 65 ఏళ్ల వయసులో మూగబోయినా, 83 ఏళ్ల వయసులో శాశ్వత విశ్రాంతి పొందే వరకూ కొనసాగింది. ఫిబ్రవరి 24, 1980 న అయన భౌతికంగా మనల్ని విడచిపోయినా అ తరువాత రెండేళ్ళకు 1982 లో వచ్చిన మేఘ సందేశం చిత్రములోని ముందు తెలిసినా ప్రభూ –, ఆకులో ఆకునై –, వంటి భావ గీతాలు, నాలుగేళ్ళకు 1984 లో వచ్చిన ఆనంద భైరవి చిత్రములోని కొలువైతివా రంగ సాయి–, వంటి చలన చిత్ర గేయాలు తెలుగువారి హృదయాలను అలరించాయి. రేడియాలో లలితగీతాలు, నాటికలు, సినిమాల్లో పాటలు రాయడం ద్వారా ప్రారంభమైన వారి ఖ్యాతి పొందారు. ఇప్పటికీ ఔత్సహికులు వారి రచనలను సేకరించి ప్రచురిస్తూనే ఉన్నారు. వీరిని హరిజనోద్ధరణ కార్యక్రమాలలో పాల్గొన్నందున బంధువులు వెలివేశారు. అయినా వెనుకాడని కృష్ణశాస్త్రి వేశ్యావివాహ సంస్థను ఏర్పాటు చేసి ఎందరో కళావంతులకు వివాహాలు నిర్వహించారు. సంఘ సంస్కరణా కార్యక్రమాలు నిర్వహిస్తూనే "ఊర్వశి" అనే కావ్యం వ్రాశారు. వ్యావహారిక భాషవాదం, బ్రహ్మసమాజం వంటి ఉద్యమాలు ప్రభావంతో కృష్ణశాస్త్రి తన అధ్యాపకవృత్తిని వదలి బ్రహ్మసమాజంలో పాల్గొనడం, అదే సమయంలో సాహితీ వ్యాసంగం, 1922లో భార్యా వియోగానంతరం ఆయన రచనలలో కనిపించే విషాదం,1929లో విశ్వకవి రవీంద్రనాథ టాగూరుతో పరిచయం, 1933–41 మధ్య కాలంలో కాకినాడ కాలేజీలో తిరిగి అధ్యాపకవృత్తిని చేపట్టారు. 1942లో బి.ఎన్.రెడ్డి ప్రోత్సాహంతో మల్లీశ్వరి చిత్రానికి పాటలు వ్రాశారు. తరువాత అనేక చిత్రాలకు సాహిత్యం అందించారు. 1957లో ఆకాశవాణిలో చేరి తెలుగు సాహిత్య ప్రయోక్తగా అనేక గేయాలు, నాటికలు, ప్రసంగాలు అందించారు.

"కృష్ణ శాస్త్రి బాధ ప్రపంచానికి బాధ. ప్రపంచం బాధ శ్రీశ్రీ బాధ" అని చలం "మహాప్రస్తానం" ముందు మాటలో అధిక్షేపిస్తే, "నవ్విపోదురు గాక నా కేటి సిగ్గు ?నా యిచ్చయే గాక నా కేటి వెరపు ?" అన్న ధీశాలి శ్రీ దేవులపల్లి. ఇక ప్రేమ గురించి వ్రాస్తూ "పూలెందుకు గుభాళిస్తాయో, చందమామ వెన్నెల ఎందుకు కురిపిస్తుందో, నీరెందుకు పారుతుందో, గాలెందుకు వీస్తుందో అందుకే నా హృదయం నిన్ను ప్రేమిస్తుంది" అంటారాయన. అయన వ్రాసిన "జయ జయ జయ ప్రియ భారత జనయిత్రీ ...." అంటూ సాగే దేశభక్తి గేయం మన జాతీయ గీతము హోదా కొరకు చివరి వరకూ పోటీలో నిలబడి, కేవలం అయన దక్షిణాది కవి కావడము వల్లనే అ హోదా పొందలేక పోయిందని ఆనాటి వారి అభిప్రాయము. బహుశా అందువలనే అయన జన హృదయాన్ని గెలిచినప్పటికీ చరిత్రలో పొందవలసిన స్థానాన్ని పొందలేక పోయారు.ఏది ఎమైనా వారి స్వగ్రామము రావు వారి చంద్రంపాలెం మన మండలములో ఉండడం మనకు గర్వ కారణం.

## భక్తుల తాకిడి పెరిగిన ముత్యాలవారిపాలెం శ్రీ రుద్రగుండ మహాక్షేత్రం



ాఎంౕవలి, మేజర్‌న్యూస్ : వంుకా్కవుల శివారు ముత్యాల వారిపాలెం గ్రామంలో పవిత్ర వశిష్ట గోదావరి సమీపంలో ఆచ ంట కాలువ ప్రక్కన వెలసిన శ్రీ రుద్రగుండ మహాక్షేత్రంకు భక్తుల తాకిడి పెరిగింది. విఘ్నేశ్వర స్వామి వారు,ఆంజనేయస్వామి వారు ఈ క్షేత్రానికి క్షేత్రపాలకులు. ఈ క్షేత్రంలో ఆంజనేయస్వామి, అన్నపూర్ణ సమేత కాశీ విశ్వేశ్వర స్వామి వారు నాగేంద్రుడు వల్లి దేవసేన సమేత కళ్యాణ సుబ్రహ్మణ్యేశ్వర స్వామి వారు కొలువై ఉంటారు. శ్రీ రుద్ర గుండ మహాక్షేత్రంలో మాసశివరాత్రి రోజు అన్నపూర్ణ సమేత కాశీ విశ్వేశ్వర స్వామి వారికి అభిషేకం నిర్వహించడం జరుగుతుంది.అలాగే వల్లి దేవసేన సమేత కళ్యాణ సుబ్రహ్మ ణ్యేశ్వర స్వామి వారికి ప్రతి మంగళవారం ఉత్సవమూర్తులకి అభిషేకం అలాగే కృత్తిక నక్షత్రం రోజు మూలవరులకి అభిషేకం అర్చది కార్యక్రమాలు జరుగుతాయి. ఈ క్షేత్రాన్ని దర్శించిన వారికి కళ్యాణం అలాగే సంతాన ప్రాప్తి కలుగుతుంది అని ముత్యాలవారిపాలెం గ్రామస్తులు అందరూ నమ్ముతూ ఉంటారు. ఈఆలయానికి దూరప్రాంత భక్తులు తాకిడి కూడా పెరగడంతో ఇక్కడ సౌకర్యాల కల్పనపై ఆలయ కమిటీ వారు దృష్టి పెడుతున్నారు.

## విజయవంతంగా మెడికల్ క్యాంపు



**సామర్లకోట, మేజర్ న్యూస్ :** ఫ్రెండ్స్ గ్రౌండ్ వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం జూనియర్ కాలేజ్ గ్రౌండ్‌లో మెడికల్ క్యాంపు నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా వాకర్స్ అసోసియేషన్ జనరల్ సెక్రెటరీ విప్పర్తి కొండలరావు మాట్లాడుతూ ప్రతినెల మొదటి ఆదివారం మెడికల్ క్యాంపు విజయవంతంగా కొనసాగుతుందిని. అలాగే ఈనెల జరుగు మెడికల్ క్యాంపుకు కావలసిన మెటీరియల్ అందజేసిన దాతలు అంబటి అప్పారావు గారికి అంబటి మారేశ్వరి గారికి ఫ్రెండ్స్ వాకర్స్ అసోసియేషన్ తరపున ధన్యవాదాలు తెలియజేశారు. అలాగే ప్రతి నెల ఫ్రెండ్స్ వాకర్స్ అసోసియేషన్ వారు నెలలో మొదటి ఆదివారం నిర్వహిస్తున్న మెడికల్ క్యాప్ ను ప్రతి ఒక్కరూ వినియోగించుకోవాలని ఆయన కోరారు. ప్రస్తుత ఈ కాలంలో మనం తినే ఆహారాన్ని బట్టి వయసుతో నిమిత్తం లేకుండా ప్రతి ఒక్కరికి బీపీ షుగరు అనేవి వస్తున్నాయని అన్నారు. కాబట్టి ప్రతి నెల క్రమం తప్పకుండా ఈ మెడికల్ క్యాంప్ వినియోగించుకోవడం ద్వారా ఆరోగ్యం కాపాడుకోగలుగుతామని ముందుగా జాగ్రత్తలు తీసుకోగలుగుతామని ఆయన తెలియజేశారు. అలాగే ఈ మెడికల్ క్యాంపుకు డాక్టర్ శ్రీధర్ ఎంతో సహకరిస్తున్నారని ప్రీతీ ఒక్కరిని వారు చెకప్ చేసి సలహాలు సూచనలు ఇస్తున్నారని. వారికి వాకర్స్ తరఫున అభినందనలు తెలియ జేశారు. అలాగే ఈ మెడికల్ క్యాంపును విజయవంతంగా నడిపించాలని వాకర్స్ అసోసియేషన్ సభ్యులు ఆయన కోరారు పట్టణ ప్రజలు ఈ మెడికల్ క్యాంపు వినియోగించుకోవాలని తెలియజేశారు. ఈ మెడికల్ క్యాంపును క్రమం తప్పకుండా వాకర్స్ అసోసియేషన్ కో ఆప్షన్ సభ్యులు సత్యానందం అలాగే మణి రాజు ఆర్గనైజింగ్ చేస్తున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో కోశాధికారి గుండు శంకర్రావు కమిటీ సభ్యులు లింగం శివప్రసాద్ కుంచె శ్రీనివాసు సింగంపల్లి శ్రీనివాసు సభ్యులు బుల్లి రాజు స్టూడియో ప్రసాద్ నజీర్ నాయుడు మాస్టారు కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# ఉప్పలపాడులో లక్ష్మీనారాయణ హోమం



గండేపల్లి,మేజర్‌న్యూస్ : ఉప్పలపాడు శ్రీ వేంకటేశ్వర స్వామి కళ్యాణ మండపం ఆవరణలో కార్తీక మాసాన్ని పురస్కరించుకుని క్షీరాబ్ది ద్వాదశ సందర్భంగా ఆలయ పురోహితులు బొల్లా ప్రగడ వెంకటేశ్వర శర్మ, మల్లేపల్లి గ్రామ పురోహితులు చింత వినయ్ శర్మ ఆధ్వర్యంలో లక్ష్మీనారాయణ హోమం జరిపించారు. గ్రామ సర్పంచ్ అడబాల రామాంజనేయుల దంపతులు, వారి కుటుంబ సభ్యులు చేతుల మీదుగా ఈ హోమం నిర్వహించారు.

మహిళలు లలితా సహస్రాన్ని పఠించారు.ఈ సందర్భంగా రామాంజనేయులు మాట్లాడుతూ ఉసిరి చెట్టు వద్ద శివపార్వతులకు పూజలు జరిపించి,లక్ష్మీనారాయణ హోమం,అనంతరం భారీఅన్నసమారాధన నిర్వహించబడు తుందన్నారు. సాయంకాలం అయ్యప్ప స్వాముల ఆధ్వర్యంలో పడిపూజకార్యక్రమం నిర్వహించబడు తుందన్నారు. ఈ కార్యక్రమంలో అడబాల భాస్కరరావు,తమటం నాగేంద్ర, కంటిపూడి సత్యనారాయణ, తమటం భద్ర రావు,అక్కి శెట్టి అర్జబ్బాయి, రామకృష్ణ సత్తిబాబు గురువు, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని స్వామివారి ప్రసాదాన్ని స్వీకరించారు.

# చట్టాలు తెలుసుకొని హక్కులు సాధించుకోవాలి

– ఆదివాసీ సంక్షేమ పరిషత్



**రంపచోడవరం, మేజర్ న్యూస్ :** ప్రతి గిరిజనుడు ఆదివాసీ చట్టాలు గురించి తెలుసుకుంటేనే హక్కులు పొందగలమని ఆదివాసీ సంక్షేమ పరిషత్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కుంజా శ్రీను తెలియజేసారు. దేవీపట్నం మండలం ఇందుకూరు–1 ఆర్ అండ్ ఆర్ కాలనీలో ఆదివారం చైతన్య సదస్సు నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆదివాసీ ఓట్లుతో గెలిచిన ప్రజా ప్రతినిధులు ఆదివాసీ చట్టాలు విస్మరించి నాన్ ట్రైబల్స్‌కు తొత్తులుగా ఉంటున్నారు తప్ప నీరుగారిపోతున్న చట్టాలు అమలుకు కృషి చేయడం లేదన్నారు. ఆదివాసీలు ఆదమరిచి ఉంటే భవిష్యత్తులో ఉన్న హక్కులు దక్కవని, కాబట్టి ప్రతి ఆదివాసీ చట్టాలు అమలుకై పోరాడాలని పిలుపు నిచ్చారు. పోలవరం ప్రాజెక్టు వలన నిర్వాసితులుగా మారిన ఆదివాసీ కుటుంబాల జీవితాలు చిన్నభిన్నం అయ్యాయన్నారు. వలస నాన్ ట్రైబల్స్ అడ్డదారుల్లో కోట్లు దండుకున్నారని, అన్ని హక్కులు కలిగిన ఆదివాసీలకు మాత్రం నేటికి సరైన నష్ట పరిహారం, భూమికి భూమి దక్కలేదని, ఇదంతా ప్రభుత్వాల వైఫల్యమేనని ఆయన మండిపడ్డారు. 1/70 చట్టం అమలు విషయంలో ప్రభుత్వం, అధికారులు చిత్తశుద్ధి చూపడం లేదని, చట్టాలు అమలుకై సంక్షేమ పరిషత్ తో కలిసి రావాలని ఆయన ప్రజలకు పిలుపు నిచ్చారు. ఈ కార్యక్రమంలో ఆదివాసీ సంక్షేమ పరిషత్ డివిజన్ ప్రధాన కార్యదర్శి చోడి ప్రదీప్ కుమార్ దొర, డివిజన్ కోఆర్డినేటర్ పీట ప్రసాద్, ఆదివాసీ నాయకులు యాలగడ నాగేశ్వరావు, వీరభద్రం రెడ్డి, వెంకన్న రెడ్డి, నాగి రెడ్డి, ఆదివాసీ ప్రజలు పాల్గొన్నారు.